మార్మోగిన జై జగన్ నినాదం

- నియోజకవర్గంలో 'జగనన్నే మా భవిష్యత్తు' విజయవంతం
- కె.కె.రాజు ఆధ్వర్యంలో భారీ బైక్ ర్యాలీ


సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ


వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ చేస్తున్న కార్పొరేటర్లు, పార్టీ నాయకులు, అభిమానులు

సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలో శనివారం జై జగన్ నినాదం మార్మోగింది. జగనన్నే మా భవిష్యత్తు – మా నమ్మకం నువ్వే జగన్ మెగా పీపుల్స్ సర్వే కార్యక్రమం విజయవంతమైన సందర్భంగా సంబరాలు నిర్వహించారు. నెడ్‌క్యాప్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు ఆధ్వర్యంలో బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయం నుంచి ధర్మానగర్ వరకు భారీ బైక్ ర్యాలీ చేశారు. ధర్మానగర్‌లో దివంగత ముఖ్యమంత్రి, మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పార్టీ శ్రేణులకు పంచిపెట్టారు.

ఇంటింటా అపూర్వ స్పందన..

ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమానికి ప్రతి కుటుంబం నుంచి అపూర్వమైన స్పందన లభించిందని తెలిపారు. పార్టీలో ఉన్న నాయకులు, కార్యకర్తలందరూ ఇంటింటికీ వెళ్లి మెగా పీపుల్స్ సర్వే చేపట్టారన్నారు. ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు సంతృప్తి చెందిన కోటి పది లక్షల కుటుంబాలు ఫోన్ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇచ్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు మద్దతు తెలిపారని చెప్పారు. దీంతో పార్టీ కేడర్లో మరింత ఉత్సాహం పెరిగిందన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అర్హులందరికీ పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామని, ప్రజలందరూ జగనన్నను మళ్లీ ఆశీర్వదించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్లు కంపా హనోకు, అల్లు శంకరరావు, స్టాండింగ్ కమిటీ మెంబర్లు బర్కతీ ఆలీ, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, కంటిపాము కామేశ్వరి, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజని, శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ కె.వి.బాబా, పార్టీ వార్డు అధ్యక్షులు నీలి రవి, గుజ్జు వెంకటరెడ్డి, పీలా వెంకటలక్ష్మి, పైడి రమణ, రత్నాకర్, డి.శ్రీనివాస్, సీనియర్ నాయకుడు ఐ.హెచ్.ఫారూఖీ, యువజన విభాగం నాయకులు ఆళ్ల గణేష్, సునీల్‌కుమార్, మాజీ కార్పొరేటర్లు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల సభ్యులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

తాటిచెట్లపాలెం నుంచి పార్టీ కార్యాలయానికి..

తాటిచెట్లపాలెం: వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త కె.కె.రాజు పిలుపు మేరకు తాటిచెట్లపాలెంలోని సుందర అభయాంజనేయం స్వామి ఆలయం వద్ద నుంచి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, 45వ వార్డు కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో ర్యాలీగా బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. పార్టీ వార్డు అధ్యక్షుడు పైడి రమణ, నాయకులు హరిపట్నాయక్, బాబూరావు, సన్యాసప్పలనాయుడు, నేపాల్ శ్రీను, సన్ని, ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

50, 51 వార్డుల నుంచి..

మర్రిపాలెం: జీవీఎంసీ 50వ వార్డులో జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్ తన కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం వరకు భారీ బైకు ర్యాలీ నిర్వహించారు. బగాది విజయ్‌కుమార్, పైడి కృష్ణారావు మాస్టర్, శివరాం, వేణు, సబ్బవరపు శ్రీను, రామారావు, సోనీ, సరస్వతి, నారాయణరావు, సంతోష్, మురళీధర్, హరిప్రసాద్, టి.ఎస్.రెడ్డి, శ్రీనివాసరెడ్డి, సనపల నర్సింగ్, రాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

51వ వార్డు గాంధీనగర్ అంబేడ్కర్ కాలనీలో అంబేడ్కర్ విగ్రహానికి కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పూలమాలలు వేసి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలు బైకులపై బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని పార్టీ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ పైడి శ్రీను, మెట్ట దమయంతి, పప్పల లక్ష్మణ్, కరిమిరెడ్డి శ్యామ్, లత, ధర్మవతి, రత్నం, వై.వరలక్ష్మి, రాణి, వినోద్, సారిక నేకరాజు, కొప్పర అప్పారావు, కన్నబాబు, ఆర్.పైడిరాజు, చంటి, భాను, గణేష్, ఆర్.అప్పారావు, సూరిబాబు, గాంధీనగర్ వాసులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రూ.2.50 కోట్ల ఆస్తి పన్ను వసూలు


జెడ్సీ కృష్ణకు పన్ను వసూలు జాబితాలను అందిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు

కంచరపాలెం: జీవీఎంసీ జోన్–5కు సంబంధించి ఒక్క రోజులో అత్యధిక మొత్తం ఆస్తి పన్ను వసూలు చేసినట్లు రెవెన్యూ విభాగం అసిస్టెంట్ కమిషనర్ బాబూరావు తెలిపారు. శనివారం ఒక్కరోజే రూ.2,50,95,460 ఆస్తి పన్ను వసూలు చేశామన్నారు. విశాఖ కోరమాండల్ సంస్థ నుంచి రూ.1.13 కోట్లు, హెచ్‌పీసీఎల్ నుంచి రూ.1.37 కోట్ల భారీ మొత్తంలో వసూలు చేసినట్లు వివరించారు. ఈ మేరకు జ్ఞానాపురంలోని జోన్–5 కార్యాలయంలో జోనల్ కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణకు పన్ను వసూలు చేసిన జాబితాలను బాబూరావు అందజేశారు. ఒక్కరోజులో ఇంత మొత్తం వసూలు చేసిన రెవెన్యూ సిబ్బందిని జెడ్సీ అభినందించారు. ఈనెల 30 ఆఖరి రోజు కావడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు 5 శాతం రాయితీతో ఇంటి పన్ను చెల్లించవచ్చని, ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని బాబూరావు కోరారు.

జీవీఎంసీ ఆధ్వర్యంలో చలివేంద్రాల ఏర్పాటు


ఆర్ అండ్ బీ జంక్షన్‌లో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రం

మర్రిపాలెం: మండువేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. ఆర్ అండ్ బీ జంక్షన్ నుంచి పంజాబ్ హోటల్ జంక్షన్ వరకు పలు ముఖ్య కూడళ్లు, బస్ స్టాపుల్లో శనివారం చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతుండటంతో ఈ మేరకు సిద్ధం చేస్తున్నారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత


నక్కవానిపాలెంలో భవన గోడలను కూల్చివేస్తున్న టౌన్ ప్లానింగ్ అధికారులు

సీతమ్మధార: జీవీఎంసీ 14, 24, 23, 25, 15 వార్డుల్లో అనధికారిక నిర్మాణాలపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు ఉక్కుపాదం మోపారు. 24వ వార్డు నక్కవానిపాలెంలోని ఓ భవనం మూడో అంతస్తుపై అక్రమంగా నిర్మించిన గోడలను శనివారం తొలగించారు. ఏసీపీ వెంకటేశ్వరరావు ఆదేశాల మేరకు టీపీఎస్ తేజేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోడల మీద పోస్టర్లు అతికించి సుందరమైన నగరాన్ని పాడుచేస్తే తక్షణమే అపరాధ రుసుం వసూలు చేస్తామని, యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనుమతులు లేని నిర్మాణాలపై ఉపేక్షించమన్నారు. టౌన్ ప్లానింగ్ చైన్‌మెన్లు, సిబ్బంది పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ


షేక్ అవేజ్, 455వ ర్యాంకర్


నితిల్ కవిన్, 540వ ర్యాంకర్

సీతంపేట: ఐఐటీ జేఈఈ మెయిన్స్–2023 ఫలితాల్లో ఫిట్జీ విశాఖపట్నం విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. ఆల్ ఇండియా ఓపెన్ కేటగిరీలో షేక్ అవేజ్ 455వ ర్యాంకు, నితిల్ కవిన్ 540వ ర్యాంకు, పెండేల హర్షిత్ 711, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 802, పీలా రత్నహర్ష 838, టి.కెవిన్ 1057వ ర్యాంకు సాధించారు. మొత్తం 462 మంది మెయిన్స్ రాయగా.. 289 మంది విద్యార్థులు జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఈ విజయానికి కారణమైన విద్యార్థులు, అధ్యాపక బృందం, తల్లిదండ్రులను ఫిట్జీ సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు అభినందించారు.

సాంకేతిక విద్యతో ఉపాధి అవకాశాలు


విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందిస్తున్న సుబ్బిరెడ్డి

కంచరపాలెం: రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ, జిల్లా సెట్విస్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కంచరపాలెం పాత ఐటీఐలో యువతకు కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. దీనిని జిల్లా ఉపాధి కల్పనాధికారి(క్లరికల్), జిల్లా యువజన సర్వీసుల శాఖ ముఖ్య నిర్వహణాధికారి సిహెచ్.సుబ్బిరెడ్డి ప్రారంభించారు. సాంకేతిక విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్స్ అంశాలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో ఉద్యోగాల కోసం పోటీ పరీక్షలకు సన్నద్ధమై ఉన్నత అవకాశాలు పొందాలని అధికారులు సూచించారు. నైపుణ్యం గల మానవ వనరుల కొరత ఉందన్నారు. సాంకేతిక విద్యలైన ఐటీఐ, పాలిటెక్నిక్ అభ్యసించిన వారికి ఎటువంటి ఢోకా లేదని సుబ్బిరెడ్డి తెలిపారు. విద్యార్థులను ఆయన కెరీర్ గైడెన్స్ పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో ధరణి సంస్థ కార్యదర్శి బి.హరివెంకటరమణ, ప్రభుత్వ పాత ఐటీఐ ప్రిన్సిపాల్ జె.శ్రీకాంత్, వై.ఉమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు శిక్షణ


శిక్షణలో పాల్గొన్న హజ్ యాత్రికులు


శిక్షణ ఇస్తున్న మౌలానా ఖుర్షీద్

తాటిచెట్లపాలెం: యాసీన్ హజ్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రైల్వే న్యూకాలనీలోని హోటల్ సింకా గ్రాండ్‌లో హజ్ యాత్రికులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ జనరల్ సెక్రటరీ రహమతుల్లా బేగ్ మాట్లాడుతూ గతంలో హజ్ యాత్రకు హైదరాబాద్ నుంచి వెళ్లే వారని, ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో విజయవాడ నుంచే హజ్‌కు వెళ్లే ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. హజ్‌కు వెళ్లే ముస్లింలకు వారి వార్షికాదాయాన్ని బట్టి రూ.60 వేలు, రూ.30 వేల చొప్పున తోఫా కూడా ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి జిల్లాల నుంచి ప్రభుత్వం, ప్రైవేటుగా సుమారు 150 మంది ఈ ఏడాది హజ్ యాత్రకు ఎంపికైనట్లు చెప్పారు. వీరందరికీ శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు తమ సొసైటీ సొంత నిధులతో ఉచిత శిక్షణ ఇచ్చిందన్నారు. యాసీన్ మసీదు మదర్సా ప్రిన్సిపాల్ మౌలానా ఖుర్షీద్ హజ్ యాత్రలో తీసుకోవలసిన జాగ్రత్తలు, డ్రెస్ కోడ్, నిష్ఠతో కూడిన విధి విధానాలు పాటించడం గురించి వివరించారు. ఈ యాత్ర సుమారు 30–35 రోజులు ఉంటుందని, బక్రీద్ సందర్భంగా జూన్ 15 నుంచి హజీలు బయల్దేరాల్సి ఉంటుందని తెలిపారు. హజ్ యాత్రలో మీనా, అరావత్ మైదానం, ముజిద్ ఆలీఫా వంటి ప్రాంతాల్లో సందర్శిస్తారన్నారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు అహ్మదుల్లా ఖాన్, యాసీన్ హజ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు, రజాక్, ఎస్.కె.హారూన్, హాజీ మీర్ అబ్బాస్, ఎస్.కె.అహ్మదుల్లా, మౌలానా కామిల్, మీర్ అబ్బాస్ హుసైనీ, కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ నాయకుడు హైదర్ ఆలీ సింకా తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల రక్షణ చట్టంపై అవగాహన


మాట్లాడుతున్న వినియోగదారుల సంఘు చైర్మన్ మర్రి సత్యనారాయణ

కంచరపాలెం: ఐటీఐ జంక్షన్‌లోని జిల్లా వినియోగదారుల సంఘం సమైక్య కార్యాలయంలో జిల్లా వినియోగదారుల సంఘం చైర్మన్ మర్రి సత్యనారాయణ ఆధ్వర్యంలో శనివారం వినియోగదారుల రక్షణ చట్టం–2019పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనిని ముఖ్య అతిథి జిల్లా వినియోగదారుల కమిషన్ అధ్యక్షుడు జి.వెంకటేశ్వరీ ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో వినియోగదారులు ఎలా మోసపోతున్నారో తెలుసుకోవడానికి కొన్ని సంస్థలను ఎంపిక చేసి సర్వే రిపోర్ట్ ప్రభుత్వానికి తెలియజేయాలన్నారు. కోర్టు అంటే భయపడేవారు, చదువురాని వారికి వినియోగదారుల సంఘం ఎంతగానో ఉపయోగపడుతుందని చెప్పారు. వినియోగదారుల సంఘాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడం అభినందనీయమన్నారు. కమిషన్ సభ్యులు డాక్టర్ రమణబాబు, విజయదుర్గ తదితరులు పాల్గొన్నారు.

నేడు వాకర్స్ పార్కులో ఉచిత వైద్య శిబిరం

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్, ఎన్ఆర్ఐ ఆస్పత్రి సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక వాకర్స్ పార్కులో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్.వి.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ప్రసాద్ వైద్య పరీక్షలు చేస్తారన్నారు. 2డీ ఎకో పరీక్షలతోపాటు ఈసీజీ, ఇతర పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

12 కిలోల గంజాయి స్వాధీనం

- పోలీసుల అదుపులో ఇద్దరు యువకులు

సీతమ్మధార: గుట్టుచప్పుడు కాకుండా గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను శనివారం ద్వారకా జోన్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 12 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. వివరాలిలా.. ద్వారకా జోన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామాటాకీస్ వద్ద అనుమానితులుగా ఇద్దరు యువకులు కనిపించారు. అటువైపు వెళ్తున్న ద్వారకా పోలీసులు చెన్నైకు చెందిన ఆ ఇద్దరినీ అదుపులోకి తీసుకుని విచారించగా.. వారి వద్ద 12 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. దాన్ని స్వాధీనం చేసుకుని యువకులను విచారిస్తున్నారు.

పోర్టు ఉద్యోగి ఇంట్లో చోరీ

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం మెట్టు, గవర కంచరపాలెంలోని చదరం కల్యాణి అనే మహిళ ఇంట్లో శుక్రవారం అర్ధరాత్రి నాలుగు తులాల బంగారం దొంగతనానికి గురైంది. పోర్టులో ఆమె విధులు నిర్వహిస్తున్నారు. ఇంట్లో ఒంటరిగా నివసిస్తున్నారు. భర్త గతంలో మరణించారు. కల్యాణికి ముగ్గురు కుమార్తెలకు వివాహమై వేరు వేరు ప్రాంతాల్లో ఉంటున్నారు. వేసవి కాలం కావడంతో రోజూ మాదిరి శుక్రవారం రాత్రి వేళ డాబా మీద నిద్రపోవడానికి వెళ్లారు. ఉదయం లేచి వచ్చి చూసేసరికి బీరువా తెరచి ఉండటం గమనించి పోలీసులకు సమాచారం అందించారు. నాలుగు తులాల రెండు బంగారం గొలుసులు అపహరణకు గురయ్యాయని కంచరపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్రైం సీఐ దుర్గాప్రసాద్ నేతృత్వంలో ఎస్ఐ కాంతారావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పీఎస్ వద్ద ధర్నా చేసిన వారిపై కేసు

సీతమ్మధార: ఫోర్త్‌టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద శనివారం ధర్నా చేసిన పలువురిపై సీఐ శ్రీనివాసరావు కేసు నమోదు చేశారు. విధులకు ఆటంకం కలిగించిన నేపథ్యంలో కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. స్టేషన్ వద్ద ధర్నాలు చేయరాదన్నారు.

మహా అన్నదానం

సీతంపేట: రామకృష్ణానగర్‌లోని షిర్డీసాయినాథుడి మందిరం వద్ద శనివారం మహా అన్నదానం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా సాయిబాబాకు 1008 లడ్డూలతో అభిషేకం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డేటి కిరణ్‌కుమార్, ప్రతినిధులు పర్యవేక్షించారు.

అద్వితీయ చిత్రకారుడు బాలి


బాలి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కుటుంబ సభ్యులు, సాహితీ మిత్రులు

సీతంపేట: బాలి అద్వితీయ చిత్రకారుడని, ఐదు దశాబ్దాల పాటు తనదైన శైలిలో అపురూప చిత్రాలు, కార్టూన్‌లతో చెరగని ముద్రవేశారని పలువురు వక్తలు ప్రశంసించారు. ప్రముఖ చిత్రకారుడు బాలి సంస్మరణ సభ శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. బాలి కుటుంబ సభ్యులు, సాహితీమిత్రులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు సాహితీవేత్తలు, కవులు, రచయితలు బాలి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. 1974లో కార్టూనిస్టుగా ప్రారంభించి, తన జీవితం బొమ్మతో ముడిపడి ఉందని నమ్మిన వ్యక్తి బాలి అని, దశాబ్దాల పాటు ప్రముఖ చిత్రకారుడిగా ఎన్నో ప్రశంసలు, అవార్డులు పొందారన్నారు. చిత్రకళా రంగానికి ఆయన లేని లోటు తీరనిదన్నారు. కార్యక్రమంలో మేడా మస్తాన్‌రెడ్డి, శిరేల సన్యాసిరావు, అడపా రామకృష్ణ, శేఖరమంత్రి ప్రభాకర్, డి.వి.సూర్యారావు, ఎం.సుగుణరావు, బండి సత్యనారాయణ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక ఉద్యమ నిర్మాణం అవశ్యం


అమర కళాకారులకు నివాళులర్పిస్తున్న అతిథులు, ప్రజానాట్య మండలి ప్రతినిధులు

సీతంపేట: ప్రజానాట్య మండలి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో అమర కళాకారుల శత జయంతితోపాటు మహాకవి శ్రీశ్రీ 113వ జయంత్యుత్సవాలు ఘనంగా నిర్వహించారు. అమర కళాకారులు సి.నాగభూషణం, విక్టరీ మధుసూదనరావు, పద్మశ్రీ అల్లు రామలింగయ్య చిత్రపటాలకు అతిథులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు సి.స్టాలిన్ మాట్లాడుతూ సాంస్కృతిక ఉద్యమ ఆవశ్యకత నేడు అత్యంత ప్రాధాన్యం సంతరించుకుందన్నారు. సాంస్కృతిక ఉద్యమ విస్తరణలో ప్రజానాట్య మండలి ప్రముఖ పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ప్రజానాట్య మండలి రాష్ట్ర గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలి పునఃనిర్మాణంలో అల్లు రామలింగయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. 1943లో ఏర్పడిన ప్రజా నాట్యమండలి ప్రజలను చైతన్యం చేయడంలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు మాట్లాడుతూ కళా రంగంలో విప్లవాత్మక మార్పు కోసం ప్రజానాట్య మండలి చేసిన కృషి వర్ణనాతీతమన్నారు. నేడు ప్రజాస్వామ్య వ్యవస్థ అత్యంత ప్రమాదంలో పడిందని, ప్రజానాట్య మండలి కళాకారులు కళల ప్రదర్శన ద్వారా ప్రజలను చైతన్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి.సత్యనారాయణమూర్తి, ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు పి.చంద్రానాయక్, తెలంగాణ నాయకురాలు పి.నళిని, బి.శివ, కాంగ్రేగుల సత్యాంజనేయ, జి.కాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భావితరాలకు మార్గదర్శకులు


సన్మాన గ్రహీతలతో మేయర్ హరివెంకటకుమారి, పల్లా శ్రీనివాస్, కార్పొరేటర్ గోవింద్

సీతంపేట: సీతంపేట వాసులందరినీ ఒక తాటిపై నడిపించి గ్రామాభివృద్ధికి బాటలు వేసిన శ్రీకృష్ణ యువజన సేవా సంఘం అధ్యక్షుడు బోర ఈశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సారిపిల్లి గంగరాజు, కోశాధికారి బోర వెంకటరమణ భావితరాలకు మార్గదర్శకులుగా నిలిచారని పలువురు వక్తలు కొనియాడారు. సంఘ 10వ వార్షికోత్సవ సభ శనివారం సీతంపేట ఎస్‌కేవైఎస్ఎస్ ఫంక్షన్ హాల్లో ఘనంగా నిర్వహించారు. పదేళ్లలో సంఘం ద్వారా సాధించిన సీతంపేట అభివృద్ధిని వివరించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిలో కీలక పాత్ర పోషించిన బోర ఈశ్వరరావు, సారిపిల్లి గంగరాజు, బోర వెంకటరమణలను మేయర్ గొలగాని హరివెంకటకుమారి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్, కనకమహాలక్ష్మి ఆలయ ట్రస్ట్ బోర్డు సభ్యుడు సానబోయిన సురేష్‌ల చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు. సంఘం పాలకవర్గ సభ్యులను సన్మానించారు. శ్రీకృష్ణ యువజన సేవా సంఘం సేవలను స్ఫూర్తిగా తీసుకుని మరికొంత మంది యువత సంఘాలను స్థాపించి సేవ చేయడానికి ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో వారాధి యర్రాజీ రావు, నమ్మి వెంకట్, వారాధి శ్రీనివాసరావు, సారిపిల్లి సంతోష్, ముద్దాడ కొండబాబు, వియ్యపు సంతోష్, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

పోరాట దినంగా మే డే


ప్రదర్శనలో పాల్గొన్న వామనమూర్తి, కార్మికులు

సీతంపేట: మే డేను పోరాట దినంగా పాటించాలని కార్మిక వర్గానికి ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు వామనమూర్తి పిలుపునిచ్చారు. సీతంపేట గురుద్వారా రోడ్‌లో శనివారం కార్మికుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న చట్టాలను కేంద్ర ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు తాకట్టుపెట్టి తీవ్ర అన్యాయం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వరంగ పరిశ్రమలను ప్రైవేటీకరించి నిరుద్యోగాన్ని పెంచే ప్రధాని నరేంద్ర మోదీని గద్దె దింపాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులు తిరిగి వెంటనే కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రపంచ కార్మిక దినోత్సవం మే డే రోజున ఎర్ర జెండాలు ఆవిష్కరించి హక్కుల సాధనకు ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రావికృష్ణ, ఎల్.శ్రీను, బి.ఆనందరావు, సిహెచ్.దుర్గప్పడు, డి.జమన్, కె.లక్ష్మణ్ పాల్గొన్నారు.

వైభవుడికి సుప్రభాత సేవ


అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ ఘనంగా నిర్వహించారు. తెల్లవారుజామున మేళతాళాల మధ్య ఆర్జిత సుప్రభాత సేవా భక్తులు, అర్చకులు ఆలయ ప్రదక్షిణ చేశారు. సన్నిధిగొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి స్వామికి వినిపించారు. అనంతరం అభిషేకాలు నిర్వహించారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళాశాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్ర నామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. శ్రీహరిరెడ్డి, పద్మజ దంపతులు, నూకరాజు–వరలక్ష్మి దంపతుల ఆర్థిక సాయంతో మధ్యాహ్నం అలవేలు మంగ అన్నసమారాధన భవనంలో భక్తులకు అన్నదానం చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖ


సీపీ త్రివిక్రమ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొండు సీతారాం

దొండపర్తి: అందరి సహకారంతో బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో కేసులు, బాలల అక్రమ రవాణా, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. బాల్యవివాహాలపై ఎఫ్ఐఆర్, పిల్లలతో యాచక వృత్తి చేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సీతారాం సీపీ కలిసిన వారిలో లవకుశ ఉన్నారు.

నీలతిలక్‌కు కళాతపస్వి పురస్కారం


సినీ నిర్మాత పీలా నీలతిలక్‌ను సత్కరించి పురస్కారం ప్రదానం చేస్తున్న అతిథులు

సీతంపేట: మెలోడి క్రియేటర్స్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో కళాతపస్వి కె.విశ్వనాథ్‌కు స్వరాభిషేకం పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. సినీ నటుడు ఎస్.కె.మిశ్రో, గ్రంథాలయ కార్యదర్శి వర్మ చేతుల మీదుగా సినీ నిర్మాత పీలా నీలతిలక్‌ను కళాతపస్వి బిరుదుతో సత్కరించారు. ఈ సందర్భంగా గాయనీ గాయకులు సిహెచ్.వి.సత్యనారాయణ, నిషిత, ఎమ్మెస్ మాధవ్, ఎస్.రాజేశ్వరి, జ్యోతి, కె.వి.సురేష్, నిహారిక, పుండరీ కుమార్, సాత్విక తదితరులు విశ్వనాథ్ దర్శకత్వం వహించిన చిత్రాల్లోని హిట్ సాంగ్ ఆలపించి అలరించారు. కార్యక్రమంలో కళా సంస్థల ప్రతినిధులు కొణతాల రాజు, బి.ఎం.నాయుడు, పెంటకోట చిన్నారావు, చెన్నా తిరుమలరావు, ఎం.వి.రాజశేఖర్, సన్‌మూర్తి, మాల్యాద్రి, ఉషా చీరాల, తిలక్ పట్నాయక్ పాల్గొన్నారు.